ఏమన్నా ప్రసిద్ధమైనా కావ్యం రాయొచ్చు అంటే, కథ కూడా రాయొచ్చు. ఓపిక లేని వాడు కథ రాస్తే, తీరుబడీ, ఓపికా ఉన్న వాళ్ళు, అర్థికటని వచ్చినవాళ్ళు — ఏవేమిటే, మహాభారతం రాయొచ్చు!

మహాభారతం అంతా కుర్చీ గురించే కదా జరుగుత. కైక తన కొడుకుని కుర్చీమీద కూర్చోపెట్టా

# కుర్చీ



ఎలక్ట్రాన్

వి అమ్మకోవడంతోటే ఆరంభమైంది కదా అసలు రామాయణమంతా! విష్ణువు ఎన్ని అవతారాలు ఎత్తినా, ఇంద్రుడు ఎంత మంది దేవ నర్తకిలను ఎందరి మీదకు ఉసికొల్పినా, ఈ మాయదారి కుర్చీయే మూలకారణం. ఆది కాలం నుంచీ ఆధునిక కాలం వరకూ ప్రపంచ చరిత్రలో జరిగిన కుట్రలూ, యుద్ధాలూ, దారుణ మారణహోమాలూ, రాజకీయాలూ ఈ కుర్చీని గురించే కదా జరుగుత, జరుగుతూంట!

ఒక్క మనిషి కూర్చోవడానికి సరిపడేంత నాలుగు కాళ్ళ బల్లకి వీపు ఆన్చుకోవడానికి (అలాగని గోడకి జేరవెయ్యమనికాదు) ఇంత సదుపాయం చేస్తే, అదే కుర్చీ అవుతుంది. పిండి కొద్దీ రొట్టె అన్నట్టు డబ్బున్న కొద్దీ కుర్చీ అందచందాలు ఇనుమడింప చెయ్యవచ్చు. కూర్చునే వారి సుఖాన్ని ఎక్కువ

★

**ఏ దేశంలోనైనా 'కుర్చీ' చెప్పే కథలు చాలా వుంటాయి. 'కిస్సా కుర్సీ కా' అనుకోకూడదు! కుర్చీ విలువ 'వారసత్వం' బట్టి పెరగవచ్చు. దాని మీద కూర్చునే వాడి పత్తానుబట్టి పెరగవచ్చు. అదివున్న పొజిషన్ బట్టి దాని విలువ వుంటుంది. విలువ ఉన్న కుర్చీ విలువ నిలబెట్టడం ఒక వంతు...ఏ కుర్చీకైనా లేని విలువల్ని తెచ్చిపెట్టడం మరో వంతు.**

★

చెయ్యవచ్చు. ఆధునిక గృహాంతరాలంకరణ శాస్త్ర రీత్యా, డ్రాయింగ్ రూమ్‌కీ, డైనింగ్ టేబిల్‌కీ ఒకే రకం కుర్చీలు వాడరాదు. డాబామీది కుర్చీలు తోటలోకి పనికిరావు.

అయితే, చెప్పబోయేది, 'మీ తాత మొదటి సంపాదనతో చేయించిన కుర్చీ ఇది! దీన్ని ఇలా ఉంచాల్సిందే, అటక మీద పడవేయడానికి వీలు లేదు!' అనే నాయనమ్మ కుర్చీ గురించి కాదు.

ఒకట్ల స్థానంలో ఉన్న ఒకటి విలువ ఒకటి. వందల స్థానంలో ఉన్న ఒకటి విలువ వంద. అలాగే కుర్చీ విలువా, హోదా గేటు దగ్గర మొదలై, ఆఫీసులో కంటా వెడుతుండగా పెరుగుతూపోతాయి. అంతంతమాత్రం చదువుకున్న ఆసామి (గేటు దగ్గర కాకపోయినా) ఆఫీసు గుమ్మం దగ్గర మొదలు పెట్టి, ఒకొక్క కుర్చీని ఆక్రమిస్తూ, ఏళ్ళ తర్వాత పెద్ద కుర్చీలో కూర్చుంటే, అతని మనస్తత్వమూ, పరివర్తనా అదోలాఉంటాయి. అనుభవానికి మించినది మరేదీ లేదనుకొంటాడు.

పెద్ద చదువులు చదివి, ఒకటి రెండు కప్పదాట్లతో ఆ కుర్చీని ఆక్రమించినవాడి మనస్తత్వం మరోలా ఉంటుంది. చదువుని మించింది మరొకటి లేదనుకొంటాడు. గొడవ ఎక్కడొస్తుందంటే, వీళ్ళు ఒకళ్ళ కింద మరొకరు పని చెయ్యవలసి వచ్చినప్పుడు!

మా ఎస్. ఇ. (సీనియర్ ఇంజనీర్) పూర్వ కాలంలో ఉన్న సిన్సియారిటీ ఈ కాలంలో లేదంటాడు.

పరిస్థితులు మారాయి. ప్రజల దృక్పథంమారింది. దేశం నత్తనడకతో ఏదో ప్రగతిని సాధిస్తున్నట్టు కనపడుతున్నా, పనిలో పటుత్వం తగ్గింది. పనిచేసేవా డొకడూ, పాటలు పాడే వాళ్ళు పది మందీ! పనిచేసే ఆ కొద్ది మందీ ఆకాశానికి గుంజల్లా ఉంటున్నారు. అందుకే, నిర్ణీతమైన సమయంలో ఎంత గింజుకున్నా, శ్రమపడ్డా పని చేయించలేకపోయాను. సాయంకాలం వరకూ సైట్‌లో అవుతుందనుకొన్న పని జరగలేదు. మర్నాటికి పని జరిగి తీరాలి. పది మందిని ఓ.టి.(ఓవర్ టైమ్)లో పెట్టి, దగ్గరుండి రాత్రి రెండింటికల్లా పని పూర్తయిందనిపించాను.

మర్నాడు ఆఫీసుకు వెళ్ళగానే ఎస్. ఇ.ని కలుసుకొని పదిమందిని ఓ.టి.లో పెట్టి పని పూర్తి చేయించిన సంగతి చెప్పి, ప్రాజెక్టు మేనేజర్‌కి శాంక్షన్ కోసం ఫైల్ పంపమన్నాను. "వాళ్ళకి రెండు మూడు రోజులలో ఈ ఓ.టి. డబ్బులు దొరికేట్టు చేస్తానని వాగ్దానం చేసి, బతిమాలితేనేకాని పని జరగనే లేదు! రెండు నెలల క్రితం వాళ్ళ బిల్ సకాలంలో పాస్ కానందుకు నానా గొడవా చేశారు!" ఎస్. ఇ.ని హెచ్చరించాను.

"ఈ అడ్మినిస్ట్రేషన్‌తో వచ్చిన చిక్కేనయ్యా ఇది! వాళ్ళుకాని, ఎకౌంట్సువాళ్ళుకాని ఓటి. చేస్తే మర్నాటి సాయంత్రానికల్లా డబ్బులు జేబులో వేసుకొంటారు. మనలాంటి టెక్నికల్ సెక్షన్స్ అవేసరికి, వంద అబ్జక్షన్లు పెట్టి నానా రాద్ధాంతం చేస్తారు. సరేలే, నువ్వు నోట్ పుటప్ చెయ్యి—నేను శాంక్షన్ తీసుకొంటాను" అన్నాడు ఎస్. ఇ.

నోట్ రాసి, ఆయన చేత సంతకం పెట్టించి ఫైల్ ప్రాజెక్టు మేనేజర్ ఆఫీసుకి పంపించాను.

ఆ మధ్యాహ్నం మేనేజర్ అనుకోకుండా మా ఎస్. ఇ. కి ఛార్జి అప్పగించి, అర్జంటు పనిమీద ఢిల్లీ వెళ్ళిపోయాడు.

మూడింటికి ఫైల్ తిరిగి వచ్చింది. ఎకౌంట్సుకి పంపచ్చు కదా అని ఫైల్ తీసి, చూసి కొయ్యబారిపోయాను. "సకాలంలో పని చేయించలేకపోవడం ఆఫీసర్ల అసమర్థతని తెలియచేస్తుంది! ఓ. టి. కి ఒప్పుకోవటంలేదు. వీలున్నప్పుడు సి.ఓ. (కాంపెన్సేటరీ ఆఫ్) మంజూరు చెయ్యి." కింద మా ఎస్.ఇ. సంతకం. అడిగిందీ ఆయన సంతకం కిందనే! ఇవ్వనన్నదీ ఆయన సంతకం కిందనే!

నాకు తిక్క రేగింది. ఫైల్ తీసుకుని మేనేజర్ ఆఫీసులో అడుగుపెట్టాను. రివాల్వింగ్ కుర్చీలో కూర్చుని ఎస్. ఇ. ఏవో కాగితాలు చూస్తున్నాడు మహదానందంగా. విసురుగా ఫైల్ బల్లమీద పడవేయడంతో తల ఎత్తి చూశాడు. ఏమిటిది అన్నట్టు చూశాను.

"తప్పు నాదికాదు, ఈ కుర్చీది! నువ్వీకుర్చీలో కూర్చుంటే బాధ్యతతెలుస్తుంది. అయినదానికి, కాని దానికి ఓ. టి ఇస్తూ కూర్చుంటే ఇహ పని జరిగినట్లే" అన్నాడు.

నా కాయనతో మరి మాట్లాడ బుద్ధి కాలేదు. మవునంగా బయట కొచ్చేశాను. వర్కర్స్‌కి ఏం సమాధానం చెప్పుకోగలను? మేనేజిమెంట్‌కీ, వర్కర్స్‌కీమధ్య నలిగి చచ్చే నాలాంటి వాళ్ళు వీరిలో కూడా చాలా మందే ఉంటారు. అటువంటి బాధ పగవాడికి కూడా వద్దు!

ఆ తరవాత ఏం జరిగిందీ నన్ను అడగవద్దు! ఆ మాయదారి కుర్చీ ప్రభావాన్ని చాలా రోజులు తిట్టుకున్నాను.

ఒక్కొక్కప్పుడు మరొక విధంగా కూడా కుర్చీ విలువ పెరిగిపోయి, దాని కోసం నానాపాట్లు పడవలసి వస్తుంది. నాటకాలకీ, నాట్యాలకీ, గానసభలకీ ముందు కుర్చీలకి గిరాకీ. సినిమాలకి వెనక కుర్చీలకి గిరాకీ.

పక్క కుర్చీకి గిరాకీ హెచ్చే ఒక చిన్న ఉదంతం చెబుతాను. యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లో ఒక ఆదివారం ఉదయం లీలామహల్లో ఇంగ్లీషు సినిమాకని పోయాం నేనూ, రూమ్‌మేట్ రామేశం. ఒక వరసలో చివరి రెండు సీట్లూ వదలి, తర్వాత రెండూ మావి. చివరి రెండూ వదలి మూడో సీట్లో నేనూ, నా పక్కన రామేశం కూర్చున్నాం. మరో రెండు నిముషాల్లో ఇరవై ఏళ్ళ ఒక ఆంగ్లో—ఇండియన్ యువతి, ఆమె తల్లి అనుకుంటాను—మరో ముసలామె వచ్చి ఆ చివరి రెండు సీట్లలో కూర్చున్నారు. ఆ పడుచు నాపక్కన కూర్చోవడంతో, రామేశం ఇబ్బంది పడిపోసాగాడు.

సినిమా మొదలైంది. మధ్య మధ్యలో మంచి హాస్యపుజల్లుల్ని కురిపిస్తోంది. విరగబడి నవ్వుతుంటే, ఆమె భుజాలు నన్ను స్పర్శిస్తూనే ఉన్నాయి. ఇంక రామేశానికి సినిమా మీద ధ్యాస లేకుండా పోయింది. మాటిమాటికీ నన్ను గిల్లడం మొదలు పెట్టాడు. ముందర నల్లులనుకొన్నాను! నల్లులు కాదని తెలియగానే, 'ఓర్నీ జెలసీమండా!' అనుకున్నాను.

విశ్రాంతి సమయంలో బయటకు పోయాం. వేడి కాఫీ అందుకుని రామేశం నా కంటె ముందుగా తాగేశాడు. హడావుడిగా హాల్లో అడుగుపెట్టాడు. అతగాడి తొందరకి చిన్నగా నవ్వుకొంటూ, బిల్లు చెల్లించి, సావధానంగా నేను హాల్లో ప్రవేశించాను. నే ననుకున్నట్టుగానే రామేశం నేనంతకు ముందు కూర్చున్న కుర్చీలో కూర్చున్నాడు. నేను రామేశం పక్కన కూర్చున్నాను. బయటకు వెళ్ళిన వాళ్ళు ఇద్దరూ లోపలికి వచ్చి, ముసలామె రామేశం పక్కనా, ఆ పడుచు చివరి సీట్లోనూ కూర్చోవడంతో, మావాడి మొహాన నెత్తురు చుక్క లేదు! సినిమా అయేంత వరకూ నన్ను మరోసారి గిల్లి పోగులు పెట్టాడు!

జీవితంలో నేను చాలా రకాల కుర్చీల్లో కూర్చుని, చాలా రకాల బాధ్యతలు నిర్వహించాను. కాని— నేను హాయిగా ఫీలయ్యేది క్షౌరశాల కుర్చీలో కూర్చున్నప్పుడే! నేను లేచి రోడానికి భయపడే కుర్చీ?. . . దంతవైద్యుడిది! ★